## క్లుప్తంగా

### గ్రామాల్లో విస్తృత ప్రచారం


తొర్రేడులో ప్రచారంలో పాల్గొన్న మండల పార్టీ అధ్యక్షుడు వీర వెంకట సత్యనారాయణ

రాజమహేంద్రవరం రూరల్: రాజమండ్రి రూరల్ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ విజయం కోరుతూ గ్రామాల్లో పార్టీ శ్రేణులు విస్తృతంగా ప్రచారం నిర్వహించాయి. బూత్‌స్థాయిలో ప్రతి ఒక్కరు ఇంటింటికీ వెళ్లి నమూనా బ్యాలెట్ పత్రాలు పంపిణీ చేస్తూ రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేయాలని ప్రజలను కోరుతున్నారు. రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 58 నెలల కాలంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా మేలు చేశారని, కుల, మతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమాన్ని అందించిన ఏకైక ముఖ్యమంత్రి సీఎం జగన్ ఒక్కరేనని ప్రతి ఒక్కరికి వివరిస్తున్నారు. తొర్రేడులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మండల పార్టీ అధ్యక్షుడు ఉప్పులూరి వీరవెంకటసత్యనారాయణ మాట్లాడుతూ అబద్ధపు హామీలతో వస్తున్న చంద్రబాబు కూటమిని ఓటు అనే ఆయుధంతో తిప్పికొట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు, వలంటీర్ వ్యవస్థ కొనసాగాలంటే మరోసారి సీఎం జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలని అన్నారు. వెళ్లిన ప్రతిచోటా ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందని పార్టీ శ్రేణులు పేర్కొంటున్నారు.

### మాజీ సర్పంచ్ పద్మావతి మృతి


బొబ్బా పద్మావతి (ఫైల్)

ధవళేశ్వరం: ధవళేశ్వరం గ్రామ మాజీ సర్పంచ్ బొబ్బా పద్మావతి(64) ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. పద్మావతి తెల్లవారుజామున గుండెపోటుకు గురి అవ్వడంతో కుటుంబ సభ్యులు రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. పద్మావతికి భర్త బొబ్బా సుబ్రహ్మణ్యచౌదరి, కుమార్తెలు దీప్తి, కావ్య ఉన్నారు. సతీవియోగంతో బాధపడుతున్న మాజీ ఎంపీటీసీ బొబ్బా సుబ్రహ్మణ్య చౌదరిని మంత్రి ,వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు నక్కా రాజబాబు, మాజీ డిప్యూటీ మేయర్ బాక్స్ ప్రసాద్, వివిధ పార్టీల నాయకులు పరామర్శించారు.

# గ్రామ స్వరాజ్యం సాకారం

- ప్రజల చెంతకే సుపరిపాలన
- సచివాలయ వ్యవస్థతో విప్లవాత్మక మార్పులు
- రూ.24.80 కోట్లతో శాశ్వత భవనాల నిర్మాణం
- నియోజకవర్గంలో 692 మందికి ఉద్యోగాలు


శాటిలైట్ సిటీ-2 గ్రామ సచివాలయ భవనం


వృద్ధులకు పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్య స్థాపన దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేసి సఫలీకృతం అయింది. దేశంలోని మరే రాష్ట్రంలోనూ లేనివిధంగా గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది. రెండు వేల మంది జనాభాకు ఒక సచివాలయం చొప్పున నిర్మించింది. అవినీతికి తావు లేకుండా కుల,మత,వర్గ,పార్టీ, భేదాలు చూడకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేలా చర్యలు తీసుకుంది. సచివాలయ వ్యవస్థ ద్వారా వేలాది స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించింది. గ్రామ, వార్డు స్థాయిలో ప్రజలకు సంక్షేమ పథకాలు చేరవేసేందుకు వీలుగా సచివాలయాలకు అనుసంధానంగా వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చింది. ప్రతినెలా ఒకటో తేదీన పింఛనుదారుల ఇంటి తలుపుతట్టి పెన్షన్లు అందిస్తున్నారు. గతంలో ఏదైనా ధ్రువీకరణ పత్రం కావాలంటే మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడా అవసరం లేకుండా గ్రామ సచివాలయాల ద్వారా అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అందిస్తున్నారు. పింఛను, ఆరోగ్య, ఆధార్‌కార్డులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో సహా 544 సేవలను నిర్దిష్ట కాల వ్యవధిలో అందుబాటులోకి తెచ్చారు. గతంలో ఇదే పత్రాల కోసం ప్రజలు మండల కేంద్రాలకు వెళ్లి అధికారులు చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడా కష్టాలకు తెరపడింది. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం పరిధిలో మొత్తం 76 గ్రామ, వార్డు సచివాలయాలున్నాయి. వాటిలో నగరపాలక సంస్థ పరిధిలో 14 వార్డు సచివాలయాలు పనిచేస్తున్నాయి.

**సచివాలయాల ద్వారా 544 సేవలు**

సచివాలయంలో 11శాఖలకు చెందిన 544 సేవలను ప్రజలకు అందిస్తున్నారు. ప్రధానంగా గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళాపోలీసు, అగ్రికల్చర్, ఉద్యాన, పశుసంవర్థకశాఖ సహాయకులు, విలేజ్ సర్వేయర్, వీఆర్‌వోలు, ఎనర్జీ అసిస్టెంట్ (జూనియర్ లైన్‌మన్), ఏఎన్‌ఎం వంటి పోస్టులు సృష్టించారు.

**కొత్త భవనాల నిర్మాణం**

నియోజకవర్గంలో మండలాల వారీగా రాజమహేంద్రవరం రూరల్‌లో 35, కడియంలో 27 చొప్పున గ్రామ సచివాలయాలు నిర్మాణం చేపట్టారు. ఒక్కో సచివాలయానికి రూ.40 లక్షల చొప్పున రూ.24.80 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. వాటిలో ఇప్పటికే 51 సచివాలయాల నిర్మాణం పూర్తయింది. మిగిలినవి నిర్మాణంలో ఉన్నవి. వీటికి తోడు నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న 14 వార్డు సచివాలయాలు ప్రభుత్వ భవనాల్లోనే ఉన్నాయి.

**వందలాదిమందికి ఉద్యోగాలు**

ఒక్కో సచివాలయంలో ఎనిమిది మంది చొప్పున సిబ్బందిని నియమించారు. ఈ లెక్కన నియోజకవర్గంలో 76 సచివాలయాలకు 692 మంది నిరుద్యోగులకు ఉపాధి లభించింది. సచివాలయ వ్యవస్థకు అనుసంధానంగా ప్రతి 50 గృహాలకు ఒక వలంటీర్‌ను నియమించారు. నియోజకవర్గంలో సుమారు 1,200 మంది వలంటీర్లు లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించడంలో సహకరిస్తున్నారు.

### సంక్షేమానికి ఓటు వేయండి

- మంత్రి చెల్లుబోయిన వేణు పిలుపు
- ధవళేశ్వరం వడ్డెర కాలనీలో ప్రచారం


వడ్డెరలతో మాట్లాడుతున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

ధవళేశ్వరం: ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి సంక్షేమాన్ని కాపాడుకోవాలని మంత్రి, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ధవళేశ్వరం వడ్డెర కాలనీలో ఆదివారం ఆయన స్థానిక నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాలనీలో ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలు అన్నీ పరిష్కరిస్తామని మంత్రి వేణు వారికి హామీ ఇచ్చారు. ప్రభుత్వ పరంగా రావాల్సిన నిధులు మంజూరు చేయించి వారి ఉన్నతికి కృషి చేస్తామన్నారు. అర్హులైన పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి, ప్రతి కుటుంబానికి జగన్ పాలనలో లబ్ధి చేకూరిందన్నారు. ఒకవైపు పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే మరోవైపు రాష్ట్ర అభివృద్ధికి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ బాక్స్ ప్రసాద్, నాయకులు వర్రే రమేష్, కొత్తపల్లి శివాజీ, దేవులపల్లి సరితారాణి, ఎల్‌వీ ప్రసాద్, అమ్ములు, చప్పిడి జ్యోతి, కడలి రాంబాబు, వడ్డెర సంఘం అధ్యక్షుడు వెంకన్న, సంఘ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

### వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలవండి


బొమ్మూరులో వైఎస్సార్ సీపీకి మద్దతు తెలపాలని కోరుతున్న నాగేశ్వర్, నరేన్

రాజమహేంద్రవరం రూరల్: తమ ప్రాంతంలో దీర్ఘకాలికంగా ఉన్న డ్రైనేజీ సమస్యను అడిగిన వెంటనే పరిష్కరించామని, రాబోయే ఎన్నికలలో వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలవాలని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ కోరారు. ఆదివారం బొమ్మూరులోని మురళీకొండ శ్రీకృష్ణునిగుడి ప్రాంతంలో ఆయన, చెల్లుబోయిన నరేన్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడుతూ డ్రైనేజీ సమస్యను అతి కొద్దిరోజుల్లోనే పరిష్కరించామన్నారు. రాబోయే ఎన్నికలలో రాజమండ్రి రూరల్ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించాలని చందన కోరారు.

# ప్రజాక్షేమం కోరుకున్న వ్యక్తి జగన్

- నమ్మించి మోసం చేసే వ్యక్తి చంద్రబాబు
- అందుకే చంద్రబాబు వద్దు.. జగనన్నే ముద్దు
- మంత్రి చెల్లుబోయిన వేణు పిలుపు
- జేగురుపాడులో విస్తృతంగా ఎన్నికల ప్రచారం
- వైఎస్సార్ సీపీలో చేరిన జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు రోజా, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ప్రకాష్


జేగురుపాడులో ప్రచారం పాల్గొన్న మంత్రి వేణు, చందన తదితరులు


ప్రచారంలో పాల్గొన్న జేగురుపాడు గ్రామస్తులు

కడియం: ప్రజల సంక్షేమం, వారి ఆయురారోగ్యాల కోసం ఆలోచన చేసిన వ్యక్తి ఈ రాష్ట్రంలో ఎవరైనా ఉన్నారు అంటే అది కేవలం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని మంత్రి, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. ఆదివారం ఆయన జేగురుపాడు గ్రామ సర్పంచ్, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్రస్టాలిన్ ఆధ్వర్యంలో స్థానిక నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలుకరించి జగన్ ఐదేళ్ల పాలనలో అందించిన సంక్షేమ పాలన, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించి జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మంత్రి వేణు మాట్లాడుతూ ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు నాయుడు ఇష్టం వచ్చినట్టు వాగ్దానాలు చేస్తున్నారని, వాటిని నమ్మవద్దన్నారు. జగనన్న పాలనలో అందరి సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని పేర్కొన్నారు. ఏపీలో పేదలకు కంటగింపుగా మారిన చంద్రబాబు బృందాన్ని ఓడించడమే తమ లక్ష్యమన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికలలో వైఎస్సార్ సీపీ గెలుపు తథ్యమన్నారు. జగన్ పాలనలో లక్షలాది మందికి ఇళ్ల స్థలాలు పట్టాలు అందించడమే గాక పరిపాలన వ్యవస్థలో అనేక మార్పులు తీసుకొచ్చి పేదవాడికి మంచి చేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. ప్రతి రంగంలోనూ తన ముద్ర కనపడేలా వ్యవసాయ, పారిశ్రామిక, వైద్య, పర్యాటక రంగాలలో అనేక మార్పులు తీసుకొచ్చి ప్రతి రంగం సర్వతోముఖాభివృద్ధి చెందాలనే లక్ష్యంతో అడుగులు ముందుకు వేస్తున్నారన్నారు. ప్రజలకు మంచి చేసిన పార్టీకి ప్రజలలో ఆదరణ ఎప్పుడు ఉంటుందని, రాబోయే సార్వత్రిక ఎన్నికలలో నియోజక వర్గంలో గెలుపు కోసం ఆలోచించడం లేదని అత్యధిక మెజార్టీయే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. జగనన్న పాలనతో మన కుటుంబాల్లో మంచి మార్పు వచ్చిందన్నారు. ఆ మార్పు కొనసాగేందుకు మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. నవరత్నాల్లాంటి సంక్షేమ పథకాలతో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేదల హృదయాల్లో సుస్థిరస్థానం సంపాదించుకున్నారన్నారు. కుల, మత, వర్గ బేధాలు లేకుండా అర్హతే ప్రామాణికంగా నేరుగా ఇంటికే సంక్షేమ లబ్ధి అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు మాత్రమే దక్కుతుందన్నారు. కూటమి పేరుతో ప్రజలను మోసం చేసేందుకు వస్తున్న చంద్రబాబు కల్లబొల్లి మాటలను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు.

**పార్టీలో పాలపర్తి చేరిక**

కడియం మండలం జేగురుపాడు గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన మంత్రి చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ సమక్షంలో జేగురుపాడు గ్రామానికి చెందిన తంత్రీకూతుళ్లు, టీడీపీకి చెందిన జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు పాలపర్తి రోజా, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పాలపర్తి ప్రకాష్‌కుమార్ తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి మంత్రి వేణు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా మంత్రి వేణు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బ్యూటిఫికేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, మాజీ కార్పొరేటర్ గూడూరి రాధిక, వైఎస్సార్ సీపీ నాయకులు గిరజాల బాబు, నక్కా రాజుబాబు, తాడాల చక్రవర్తి, నాగిరెడ్డి శివాజీ, ఆకుల సుధాకర్, సాక కిరణ్‌కుమార్, నాగిరెడ్డి మోహన్, బళ్ళ అన్నవరం, మద్దుకూరి గోపి, మారిశెట్టి నాగన్న, బుడ్డిగ లక్ష్మణ రావు, నిచ్చెనగోళ్ల గోవింద్, పుట్టా బుజ్జి, సాపిరెడ్డి సూరిబాబు, దొంతంశెట్టి వీరభద్రయ్య, చీరా రాజు, బిల్లకుర్తి ముత్యాలరావు, మెల్లిమి గంగ రాజు, అయినవిల్లి వెంకటేశ్వర రావు, బుడ్డిగ పండు, యర్ర సత్యనారాయణ, సాపిరెడ్డి కామేష్ పాల్గొన్నారు.

# జగన్ పాలనలో కాపులకు ప్రాధాన్యం

- వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం సిటీ అసెంబ్లీ అభ్యర్థి భరత్‌రామ్
- కాపు కల్యాణ మంటపానికి రూ.10 లక్షల విరాళం : అడపా శ్రీహరి



నగర కాపు సంఘం ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న రాజమహేంద్రవరం సిటీ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ రామ్

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్ సీపీ కాపులకు అధిక ప్రాధాన్యం ఇచ్చిందని రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యులు, రాజమహేంద్రవరం సిటీ అసెంబ్లీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ అన్నారు. స్థానిక చెరుకూరి కల్యాణ మంటపంలో ఆదివారం నగర కాపు సంఘం అధ్యక్షుడు నందెపు శ్రీనివాస్ అధ్యక్షతన కాపుల ఆత్మీయ సభ జరిగింది. ఈ సభలో ముందుగా నందెపు శ్రీనివాస్ మాట్లాడుతూ కాపులకు మేలు చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వెంటే కాపులంతా ఉన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌ను సీఎం చేయడానికి మార్గాని భరత్‌ను సిటీ ఎమ్మెల్యేగా, డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను ఎంపీగా గెలిపించుకుంటామన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక కాపులకు జనాభా ప్రాతిపదికన కార్పొరేషన్‌లో సీట్లు కేటాయించాలని, నామినేషన్ పదవుల్లో తగిన అవకాశాలు కల్పించాలని కోరారు. గత టీడీపీ పాలనలలో కాపు జాతి నాయకుడు వంగవీటి మోహనరంగా హత్య జరిగిందని, కాపుల రిజర్వేషన్ కోసం పోరాడిన ముద్రగడ పద్మనాభాన్ని తీవ్రంగా అవమానించారని, తుని రైలు దహనం కేసుల్లో కాపులను తీవ్రంగా ఇబ్బందులు పాలుచేశారని గుర్తు చేశారు. కాపుల చిరకాల కోరికైన కాపు కల్యాణ మంటపం నిర్మాణానికి స్థలం కేటాయించి సహకరించాలని నందెపు శ్రీనివాస్, నగర వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అడపా శ్రీహరి కోరారు. మీరు చేయగలరన్న ఆశతోనే కల్యాణ మంటపం గురించి కోరుతున్నామని అడపా శ్రీహరి అన్నారు. కల్యాణ మంటపం నిర్మాణానికి తన వంతుగా రూ.10లక్షల విరాళాన్ని శ్రీహరి ప్రకటించారు. కాపులకు మేలు చేసిన వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించుకుంటామన్నారు.

**రెండేళ్లలో నగర స్వరూపం మారుస్తా..**

ఈ సందర్భంగా మార్గాని భరత్ రామ్ స్పందిస్తూ కాపు కల్యాణ మంటపానికి స్థలం కేటాయింపునకు గతంలోనే ప్రయత్నించామన్నారు. ఆవరోడ్డులో 1,800 గజాల స్థలాన్ని గుర్తించి కేటాయించడానికి కృషి చేశామని, అయితే కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఈ ప్రయత్నం ఫలించలేదన్నారు. జగన్ ప్రభుత్వంలో కాపు నేస్తం వంటి పథకాలను అమలు చేశామన్నారు. ఈ ఎన్నికల్లో కాపులకు ఏ పార్టీ ఎక్కువ సీట్లు కేటాయించిందో బేరీజు వేసుకోవాలన్నారు. తనకు వ్యాపారాలు లేవని రాజమహేంద్రవరం అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నానన్నారు. ఎంపీగా రాజమహేంద్రవరానికి అభివృద్ధిలో ఒక గుర్తింపును తీసుకువచ్చానని, ఎమ్మెల్యేగా గెలిపిస్తే రెండేళ్లలోనే నగర స్వరూపాన్ని మార్చి చూపిస్తానన్నారు. నగరంలో శాంతిభద్రతలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ తాను మేనిఫెస్టో ప్రకటించానన్నారు. బ్లేడ్ బ్యాచ్, గంజాయిబ్యాచ్, రౌడీ మూకలనే వారు నగరంలో లేకుండా నగర బహిష్కరణ చేస్తామన్నారు. ఎంతోకాలంగా సమస్యాత్మకంగా ఉన్న మోరంపూడి జంక్షన్‌లో తాను ఫ్లైఓవర్ మంజూరు చేయించి, ఎన్నికల్లోగా పూర్తిచేయాలని నిబద్ధతతో పనిచేస్తే, ప్రతిపక్ష పార్టీకి చెందిన వారు ఫ్లైఓవర్ నిర్మాణ పనుల్లో పాల్గొనే కూలీలను సైతం పనికి రానీయకుండా డబ్బులు ఇచ్చి ఇక్కడ నుంచి పంపించి నీచమైన రాజకీయాలకు తెరలేపారని మండిపడ్డారు. సీఎం జగన్‌తో తనకు ఉన్న సన్నిహిత సంబంధం కారణంగానే నగరాన్ని అభివృద్ధి చేయగలిగానన్నారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చాక నగర కాపు సంఘం అధ్యక్షుడు నందెపు శ్రీనివాస్‌కు తగిన గుర్తింపు ఇస్తామన్నారు. నగర అభివృద్ధికి తాను చేసింది చెప్పుకోవడానికి ఎంతో ఉందని, గత 16 ఏళ్లుగా వివిధ పదవుల్లో ఉన్న ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులకు చెప్పడానికి ఏముందని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో గెలిపిస్తే మీ బిడ్డగా మీకు అందుబాటులో ఉండి పనిచేస్తానన్నారు.

**జగన్ సుపరిపాలనకు మద్దతు ఇవ్వండి**

ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం జగన్ సుపరిపాలనకు మద్దతు ఇవ్వాలన్నారు. వచ్చే ఎన్నికల్లో తనను ఎంపీగా, భరత్‌ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే అందుబాటులో ఉండి పని చేస్తామన్నారు. వంగవీటి రంగా మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుడు వంగవీటి నరేంద్ర మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కాపులపై జరిగిన దాడులు, అవమానాలు తెలిసినవేనన్నారు. కాపులకు గౌరవం దక్కే పార్టీకే అండగా నిలవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పోటీ చేస్తున్న బీజేపీ కాపులకు ఒక్క సీటు కూడా కేటాయించలేదన్నారు. కాపులకు అధిక సీట్లు కేటాయించిన వారికే మనం మద్దతుగా నిలుద్దామన్నారు. పేద, బలహీన వర్గాల అభ్యున్నతికి పనిచేస్తున్న జగన్ వెంటే మనం నడుద్దామన్నారు. మాజీ ఎమ్మెల్యే, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ నగరంలో కాపు కల్యాణ మంటపం నిర్మాణానికి నందెపు శ్రీనివాస్ బాధ్యత తీసుకుంటే తామంతా అండగా నిలబడి పూర్తిచేయిస్తామన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కాపులకు అధిక ప్రాధాన్యం దక్కిందని, ఇప్పుడు జగన్ ప్రభుత్వంలో పేద కాపుల కోసం కాపు నేస్తం వంటి పథకాలు అమలు జరుగుతున్నాయన్నారు. ఈ సభలో అసెంబ్లీ పరిశీలకుడు రావిపాటి రామచంద్రరావు, మాజీ కార్పొరేటర్లు మానె దొరబాబు, ఇసుకపల్లి శ్రీనివాస్, చోడిశెట్టి సత్యవాణి, వైఎస్సార్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు మద్దాల అను, రంగా మిత్రమండలి జిల్లా అధ్యక్షుడు వడ్డి మురళి మాట్లాడారు. గుర్రం గౌతమ్, వక్కపాటి మురళి, కంచుమర్తి చంటి, చవ్వాకుల సుబ్రహ్మణ్యం, నామన వాసు, రొక్కం త్రినాథ్, పాదిలాపు నాగేంద్ర, ఐ.శ్రీను, మద్దాల రవిశంకర్, వంటెద్దు సూరిబాబు, వలవల చిన్ని, బంటి, కుంచె శేఖర్, పి.వినయ్, కొల్లిమళ్ళ రఘు, పైడా వాసు, ఎ.చంద్రశేఖర్, పురంశెట్టి ప్రసాద్‌నాయుడు, దూలం ప్రసాద్, పెద్దఎత్తున కాపు సంఘీయులు పాల్గొన్నారు.

# అంబేడ్కర్ స్ఫూర్తితో సంక్షేమ పాలన

దేవరపల్లి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తితో రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందించారని వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని కృష్ణంపాలెం, ధుమంతునిగూడెం, కొత్తగూడెం, రామన్నపాలెం, అచ్చియపాలెం, బుచ్చియపాలెం, దేవరపల్లి గ్రామాల్లో ఆదివారం ఆమె ఎన్నికల ప్రచార రోడ్ షో నిర్వహించారు. ఉదయం 8 నుంచి రాత్రి 11 గంటల వరకూ ఉత్సాహంగా ఈ ప్రచారం సాగింది. రాత్రి దేవరపల్లి బస్టాండ్ వద్ద నిర్వహించిన సభలో మంత్రి వనిత ఓటర్లను ఉద్దేశించి మాట్లాడారు. సంక్షేమ పాలన మళ్లీ పొందాలంటే ఈ నెల 13న జరుగుతున్న ఎన్నికల యుద్ధంలో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి జగనన్నను గెలిపించాలన్నారు. జగనన్న ప్రతినిధులుగా రాజమహేంద్రవరం లోక్‌సభ అభ్యర్థిగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను గెలిపించాలని కోరారు.

# మరిది కళ్లలో ఆనందం కోసమే పురందేశ్వరి పోటీ

- రాష్ట్ర ఖజానా దోచుకోవడం చంద్రబాబు లక్ష్యం
- బీజేపీ, టీడీపీ నేతలపై వంగవీటి నరేంద్ర ఆగ్రహం


నగరంలో ప్రచారం నిర్వహిస్తున్న వంగవీటి నరేంద్ర, ఎంపీ మార్గాని భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: మరిది చంద్రబాబు కళ్లలో ఆనందం కోసం రాజమహేంద్రవరంలో బీజేపీ చీఫ్ పురందేశ్వరి పోటీ చేస్తున్నారని వంగవీటి రాధా,రంగా మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నేత వంగవీటి నరేంద్ర ధ్వజమెత్తారు. ఆదివారం నగరంలోని 2, 9 డివిజన్‌లలో ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ ఎన్నికల ప్రచారంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుటుంబ సభ్యుల కోసం రాజకీయంగా ఎంతకైనా దిగజారే మనస్తత్వం పురందేశ్వరిది అన్నారు. చంద్రబాబుకు పదవీ కాంక్ష తప్పిస్తే రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం అక్కర్లేదన్నారు. కేవలం రాష్ట్ర ఖజానాను దోచుకోవడమే లక్ష్యంగా రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. 2014 ఎన్నికలలో 696 హామీలు గుప్పించి, అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఒక్క హామీని కూడా సక్రమంగా అమలు చేయలేదన్నారు. ఇప్పుడు మళ్లీ బీజేపీ, జనసేనతో జతకట్టి ఆచరణకు సాధ్యం కాని హామీలతో ప్రజలను మోసగించి ఓట్లు వేయించుకోవడానికి యత్నిస్తున్నాడని, ప్రజలు చంద్రబాబు అసలు గుణాన్ని గుర్తించి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు గత పుష్కరాలకు 29 మందిని పొట్టన బెట్టుకున్నారని, ఈ విషయం నగర ప్రజలు ఎప్పుడూ మర్చిపోలేరన్నారు. కనీసం నగరానికి వచ్చినప్పుడైనా చంద్రబాబు మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించిన దాఖలాలు లేవన్నారు. ఇటువంటి నాయకులను చిత్తు చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. బీజేపీ, టీడీపీలకు ప్రజలకు సేవ చేయాలనే ఆలోచన లేదని, కేవలం అధికార దాహంతోనే కూటమిగా ఏర్పడ్డాయని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలన అందిస్తూ పేదరిక నిర్మూలన కోసం కృషి చేస్తున్నారని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇటువంటి సంక్షేమ పాలన ఏ ప్రభుత్వం అందివ్వడం లేదన్నారు. ప్రజలకు మంచి చేయాలనే మనసున్న నేత జగనన్న అని, మరోసారి సీఎంగా జగనన్నను ఎన్నుకుంటేనే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాజమండ్రి సిటీ ఎమ్మెల్యేగా మార్గాని భరత్ రామ్‌ను, ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాల ప్రజలను అభ్యర్థించారు.

**యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యం**

ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ నగరంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే తన లక్ష్యమని ప్రకటించారు. నగరంలో రెండు సాఫ్ట్‌వేర్ కంపెనీలను, పేపర్ మిల్లు వంటి మరో రెండు పరిశ్రమలు తీసుకొచ్చి నగరంలో కనీసం పది వేలమంది నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నదే తన సంకల్పం అన్నారు. అభివృద్ధి, సంక్షేమం జగనన్న వల్లనే సాధ్యమన్నారు. సిటీ ఎమ్మెల్యేగా నన్ను గెలిపిస్తే మీ ఇంటి పెద్ద కొడుకునై మీకు ప్రజాప్రతినిధిగా సేవలందిస్తానన్నారు. చంద్రబాబు అబద్ధాల పుట్ట అని, చెప్పేవాటికి చేతలకూ అసలు పొంతనే ఉండదన్నారు. నగరంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే లేకపోవడం వల్ల ఇళ్ల స్థలాల పంపిణీ, ఇళ్ళ నిర్మాణంలో తీవ్ర జాప్యం జరిగిందన్నారు. టీడీపీ నేతలు అడుగడుగునా ఆటంకాలు సృష్టించడమే ప్రధాన కారణమని చెప్పారు. అందరి ఆశీస్సులతో సిటీ ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత ఇళ్ల పట్టాలిచ్చిన అందరికీ ఇళ్లు నిర్మించి, లబ్ధిదారుల గృహప్రవేశం దగ్గరుండి చేయిస్తా అన్నారు. తనను, పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించమని కోరారు.

# ప్రత్యేక హోదా, విభజన హామీలపై మోదీ ప్రకటన చేయాలి

**వైఎస్సార్ సీపీ నాయకుడు విశ్వేశ్వరరెడ్డి డిమాండ్**


విలేకరులతో మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: ఎన్డీఏ కూటమి ఎన్నికల ప్రచార సభకు సోమవారం రాజమహేంద్రవరం విచ్చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇచ్చిన ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుపై ప్రకటన చేయాలని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు టీకే విశ్వేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమరావతిలో రాజధాని నిర్మాణం శంకుస్థాపనకు వచ్చిన మోదీ చెంబుడు నీళ్లు, పిడికెడు మట్టి ఇచ్చి వెళ్లారు తప్ప, రాజధాని నిర్మాణానికి ఏమాత్రం సహకరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతి వేంకటేశ్వరస్వామి సాక్షిగా అద్భుతమైన రాజధాని నిర్మిస్తామని హామీ ఇచ్చిన మోదీ మాట నిలబెట్టుకోలేదన్నారు. మోదీకి రాముడుపై తప్ప, వేంకటేశ్వర స్వామిపై భక్తి కనిపించడం లేదన్నారు. విభజన హామీలలో భాగంగా అనేక కేంద్ర ప్రభుత్వ సంస్థల ఏర్పాటు, విశాఖ రైల్వే జోన్ వంటి హామీలను ఇచ్చి విస్మరించారని ఆందోళన వ్యక్తం చేశారు. విశాఖపట్నంలో రాజధాని ఏర్పాటు చేసి ఉంటే ఇప్పటికే ఇక్కడ ఐటీ రంగం, సినీ పరిశ్రమ ఎంతగానో అభివృద్ధి చెంది ఉండేవని వెల్లడించారు. రాజమహేంద్రవరం వస్తున్న ప్రధానమంత్రి ప్రత్యేక హోదా, విభజన హామీలు, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ, పోలవరం నిర్మాణం వంటి అంశాలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు ఎల్‌వీ ప్రసాద్, రేగుళ్ళ బాల శ్రీధర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

# మానవతా విలువలపై నడక


నడక కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

రాజానగరం: మండలంలోని పాలచర్లలో సాయి రామ్ బాలవికాస్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం మానవతా విలువలపై నడక అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. చిరుప్రాయం నుంచి చిన్నారులకు మానవతా విలువలపై అవగాహన కలిగించడం ద్వారా వారిని సమాజహితం కోరేవారుగా తయారు చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని నిర్వాహకులు ఎస్‌వీవీ సుబ్రహ్మణ్యం తెలిపారు. పాలచర్ల, లాలాచెరువు హెచ్‌బీ కాలనీ, గాదరాడ, దోసకాయలపల్లికి చెందిన సుమారు వంద మంది విద్యార్థులు పాల్గొన్నారు.